TELANGANA SHASANA SABHA
TELTEL/2016/68867

తెలంగాణ **శాసనసభ** తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 106 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | ఆదివారం 22 సెప్టెంబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-



# నేటి నుంచి మూసీ ప్రక్షాళన...

## భారీ సంఖ్యలో ఆక్రమణలను తొలగించనున్న హైడ్రా

- హైడ్రాకు ఆక్రమణల తొలగింపు బాధ్యతలు
- ప్రజలకు పునరావాసం కల్పించడంపై దృష్టి సారించిన ప్రభుత్వం
- 12 వేల ఆక్రమణలను గుర్తించిన ప్రభుత్వం

**శాసనసభ / హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని మూసీ పరివాహక ప్రాంతాల్లోని ఆక్రమణలను తొలగించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. ఆక్రమణల తొలగింపు బాధ్యతలను హైడ్రాకు అప్పగించింది. నేటి నుంచి ఆక్రమణలను తొలగించనున్నారు. మొదటి విడతగా నదీ గర్భంలోని ఆక్రమణలను తొలగిస్తారు. ఆ తర్వాత మిగతా వాటిని తొలగిస్తారు. ఈ నేపథ్యంలో ప్రజలకు పునరావాసం కల్పించడంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈరోజు పిల్లిగుడిసెలులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. వీటిని మూసీ పరివాహక ప్రాంతంలోని వారికి కేటాయించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రాంతంలో 12 వేల ఆక్రమణలను గుర్తించారు. నదీ ప్రక్షాళనలో భాగంగా 55 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఈ ఆక్రణలను తొలగించేందుకు హైడ్రాకు బాధ్యతలు అప్పగించారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ... మూసీ పరీవాహక ప్రజలకు డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించనున్నట్లు చెప్పారు. మూసీ ప్రక్షాళన, పునఃనిర్మాణాన్ని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. 55 కిలోమీటర్ల మేర మూసీ అభివృద్ధి పనులు సాగుతాయన్నారు.

# కార్మిక, ఉపాధి శాఖ అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష



**శాసనసభ / హైదరాబాద్ :** కార్మిక, ఉపాధి శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ గా మారుస్తున్న నేపథ్యంలో సిబ్బంది కొరత లేకుండా చూడాలని సూచించారు. ప్రస్తుత ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా సిలబస్ ను అప్ గ్రేడ్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సిలబస్ మార్పుకు కమిటీని నియమించి నిపుణుల సలహాలు, సూచనలు స్వీకరించాలని ఆదేశించారు సీఎం రేవంత్. అవసరమైతే స్కిల్ యూనివర్సిటీ సహకారం తీసుకోవాలని, పాలిటెక్నిక్ కళాశాలల్లో కొత్త ఏటీసీలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్ తెలిపారు. ఐటీఐలు లేని అసెంబ్లీ నియోజకవర్గాలను గుర్తించి రిపోర్ట్ సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. 100 నియోజకవర్గాల్లో ఐటీఐ/ఏటీసీలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. వృత్తి నైపుణ్యం అందించే ఐటీఐ/ఏటీసీ, పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తెచ్చేలా విధి విధానాలు రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# మేడిగడ్డ బ్యారేజీ 3, 4, 5 బ్లాక్‌లలో సమస్యలు ఉన్నాయి: ఇంజినీర్లు



- బ్యారేజీల నాణ్యత, ధృవీకరణకు సంబంధించి ప్రశ్నించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్
- కమిషన్ ఎదుట హాజరైన పదిమంది ఇంజినీర్లు
- అఫిడవిట్ల ఆధారంగా ఇంజినీర్లను ప్రశ్నించిన కమిషన్

**శాసనసభ / హైదరాబాద్ :** మేడిగడ్డ బ్యారేజీ 3, 4, 5 బ్లాక్‌లలో సమస్యలు ఉన్నాయని ఐఐటీ బృందం తెలిపిందని, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకున్నప్పటికీ ఇది పరిష్కారం కాలేదని ఇంజినీర్లు చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీతో పాటు అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు చేపట్టిన పనుల నాణ్యత, నాణ్యతా పరీక్షలు, ధృవీకరణకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సంబంధిత ఇంజినీర్లను ప్రశ్నించింది. ఈ కాళేశ్వరం కమిషన్ ఎదుట క్వాలిటీ కంట్రోల్ విభాగానికి చెందిన పదిమంది ఇంజినీర్లు హాజరయ్యారు. కమిషన్ ఎదుట దాఖలైన అఫిడవిట్ల ఆధారంగా ఇంజినీర్లను ప్రశ్నించింది.

# రాష్ట్ర ప్రభుత్వ అక్రమాలను బయటపెడతాం: కేటీఆర్



**శాసనసభ / హైదరాబాద్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పురపాలికల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూపొందించిన అమృత్ పథకంలో సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు అవినీతి చేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు.

## ఢిల్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన అతిశీ



## రాహుల్ గాంధీపై కర్ణాటకలో ఎఫ్ఐఆర్ నమోదు



వివరాలు »»2లో

## కేటీఆర్ వ్యాఖ్యలపై పరువు నష్టం దావా వేస్తాం: మంత్రి పొంగులేటి హెచ్చరిక



- రూ.8,888 కోట్లకు టెండర్లు పిలిచినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్
- రూ.8,888 కోట్ల టెండర్లు ఎవరు దక్కించుకున్నారో కేటీఆర్ చెప్పాలని నిలదీత
- లేదంటే కేటీఆర్ రాజీనామా చేస్తారా? అని ప్రశ్న

**శాసనసభ / హైదరాబాద్ :** అమృత్ టెండర్లలో అక్రమాలు జరిగాయన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిప్పులు చెరిగారు. అనవసర ఆరోపణలు చేసినందుకు గాను కేటీఆర్‌పై పరువు నష్టం దావా వేసి, చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## ఆర్టీసీ సిబ్బందిపై దాడికి పాల్పడితే కఠిన చర్యలు: టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్



## 'యథా రాజా తథా పోలీసులు' అన్నట్లుగా ఉంది: హరీశ్ రావు



# ఆ ఏడుకొండలవాడే నాతో లడ్డూ గురించి మాట్లాడించాడేమో!: సీఎం చంద్రబాబు

- వినతులు తీసుకునేందుకు టీడీపీ ఆఫీసుకు వచ్చిన చంద్రబాబు
- అక్కడున్న మీడియా ప్రతినిధులతో చిట్ చాట్
- తిరుమల లడ్డూ వ్యవహారంలో ఆసక్తికర వ్యాఖ్యలు




**అమరావతి / శాసనసభ :** టీడీపీ కేంద్ర కార్యాలయంలో సందర్శకుల నుంచి వినతులు తీసుకునేందుకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు అక్కడ ఉన్న మీడియా ప్రతినిధులతో కొద్ది సేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తిరుమల శ్రీవారి లడ్డూ వ్యవహారంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఇప్పుడు ఆ ఏడుకొండల వాడే నాతో లడ్డూ వ్యవహారంపై మాట్లాడించాడేమో! ఆ దేవుడు నా నోటినుంచి నిజాలు చెప్పించాడేమో....మనం నిమిత్త మాత్రులం.....దేవుడే అన్నీ చేయిస్తాడు... ఇదీ అంతే అనుకుంటున్నా" అని వ్యాఖ్యానించారు. తిరుమల లడ్డూ తరహాలో తయారు చేయడం ఎవరి వల్ల కాలేదు. తిరుమల శ్రీవారి లడ్డు కంటే బాగా చేయాలని చాలా మంది ప్రయత్నం చేశారు. కానీ సాధ్యం కాలేదు. వందల ఏళ్లుగా శ్రీవారి లడ్డూ అక్కడ తయారవుతోంది.

వివరాలు »»2లో

## రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 21 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమి నేడు గ్రామంలోని ఊరినడిమధ్యన ఉన్న రింగ్ రోడ్ లో ఈమధ్య ఎన్నో ప్రమాదాలు జరిగాయి. కనుక రోడ్డు ప్రమాదాల నివారణ కోసం స్పీడ్ బేకర్స్ వేయించడానికి సర్వే చేస్తున్నట్లు పంచాయతీరాజ్ డి.ఈ శ్రీనివాస్, ఏ ఈ ఉస్మాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి రవీందర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

( మొదటి పేజీ తరువాయి )

## ఢిల్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన అతిశీ

ఢిల్లీ ముఖ్యమంత్రిగా అతిశీ ప్రమాణ స్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అతిశీతో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, తదితరులు హాజరయ్యారు. గోపాల్ రాయ్, కైలాశ్ గెహ్లాట్, సౌరభ్ భరద్వాజ్, ఇమ్రాన్ హుస్సేన్, ముఖేశ్ అహ్లావత్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ కావడం తెలిసిందే. కొన్ని నెలలు తీహార్ జైల్లో ఉన్న కేజ్రీవాల్ ఇటీవలే బెయిల్ మీద విడుదలయ్యారు. జైలు నుంచి విడుదలైన తర్వాత ఆయన తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. దీంతో అతిశీ సీఎంగా ప్రమాణం చేశారు. అతిశీ కల్కాజీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆమె ఇంతకుముందు కేజ్రీవాల్ కేబినెట్‌లో ఏకైక మహిళా మంత్రిగా పని చేశారు. ఆ తర్వాత సెప్టెంబర్ 17న జరిగిన పార్టీ శాసనసభ్యుల సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలు అతిశీని సీఎంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా, ఢిల్లీ సీఎం పీఠం ఎక్కిన అతి పిన్న వయస్కురాలిగా అతిశీ ఘనత అందుకున్నారు.

## కేటీఆర్ వ్యాఖ్యలపై పరువు నష్టం దావా వేస్తాం: మంత్రి పొంగులేటి హెచ్చరిక

సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పొంగులేటి మాట్లాడుతూ... తాము రూ.8,888 కోట్లకు టెండర్లు పిలిచినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని, నిరూపించకుంటే కేటీఆర్ రాజీనామా చేస్తారా? అని సవాల్ చేశారు. రూ.8,888 కోట్ల టెండర్లు ఎవరు దక్కించుకున్నారో కేటీఆర్ చెప్పాలన్నారు. పోలింగ్ తేదీకి ఒకరోజు ముందు గత బీఆర్ఎస్ ప్రభుత్వమే టెండర్లను కట్టబెట్టిందన్నారు. టెండర్లను రూ.3,616 కోట్ల చొప్పున మూడు ప్యాకేజీలుగా పిలిచారని పొంగులేటి ఆరోపించారు. ఈ టెండర్లలో ఒక దానిని ఖమ్మంలో తనపై పోటీ చేసిన ఉపేందర్ రెడ్డి కూడా దక్కించుకున్నారని తెలిపారు. టెండర్లు వేయవద్దని తాము ఎవరినీ బెదిరించలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో మిషన్ భగీరథ పేరుతో రూ.39 వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. వీలైతే ప్రభుత్వానికి సూచనలు చేయాలని, సద్విమర్శలు చేయాలని కేటీఆర్‌కు హితవు పలికారు.

## ఆర్టీసీ సిబ్బందిపై దాడికి పాల్పడితే కఠిన చర్యలు: టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్

ఆర్టీసీ సిబ్బందిపై దాడికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. కుషాయిగూడ డిపోకు చెందిన డ్రైవర్ గణేశ్‌పై ఇటీవల దాడి జరిగింది. తార్నాక ఆర్టీసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతనిని సజ్జనార్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సంస్థ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మెరుగైన వైద్య సాయం అందించాలని వైద్యులను కోరారు. అఫ్జల్ గంజ్ నుంచి ఘట్‌కేసర్ వైపునకు వెళుతున్న మెట్రో బస్సులో గణేశ్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. నిన్న ఉస్మానియా యూనివర్సిటీ వై జంక్షన్ వద్ద కొంతమంది వ్యక్తులు అతనిపై దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులు కలిసి గణేశ్‌ను తీవ్రంగా కొట్టారు. అపస్మారకస్థితిలోకి వెళ్లిన గణేశ్‌ను తార్నాక ఆర్టీసీ ఆసుపత్రిలో చేర్చి, చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై సజ్జనార్ మాట్లాడుతూ... ఈ విషయంలో తమ సిబ్బంది తప్పు లేదని, బైక్‌లపై వచ్చిన వారు ఉద్దేశపూర్వకంగా దాడికి పాల్పడ్డారన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేసిన వెంటనే హైదరాబాద్ కమిషనరేట్, ఓయూ పోలీసులు స్పందించారని తెలిపారు. దుండగులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తమ సిబ్బందిపై దాడి చేయడం బాధాకరమన్నారు. సిబ్బందిపై దాడికి పాల్పడితే యాజమాన్యం సహించదన్నారు.

## 'యథా రాజా తథా పోలీసులు' అన్నట్లుగా ఉంది

కొందరు పోలీసు అధికారుల తీరు 'యథా రాజా తథా పోలీసులు' అన్నట్లుగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ బ్రాండ్‌కు కొందరి తీరు కారణంగా అవినీతి మకిలిపడితే సీనియర్ పోలీస్ అధికారులు పడిన శ్రమ వృథా అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కసారి ఈ విషయాన్ని తెలంగాణ సీనియర్ పోలీస్ అధికారులు పునరాలోచించి దిద్దుబాటు చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు హరీశ్ రావు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. యువ అధికారులకు ప్రభుత్వాలు ఆదర్శంగా ఉండి... వాళ్లకు పని పట్ల నిబద్ధత, ప్రజా సేవ పట్ల అంకితభావాన్ని నేర్పించాలని హితవు పలికారు. కానీ రాష్ట్రంలో రాజు తీరుగా పోలీసులు ఉన్నారన్నట్లుగా పరిస్థితి తయారైందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఆలోచనలతో తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగాన్ని గత పదేళ్ల కాలంలో దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దామన్నారు. ఆ ప్రక్రియలో ఎందరో తెలంగాణ సీనియర్ ఐపీఎస్ పోలీస్ అధికారుల అనుభవంతో కూడిన పాత్ర కచ్చితంగా ఉందని ప్రశంసించారు.

# ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీలో

## కావాలిబుగ్గ రాములు ముదిరాజ్ కు చోటు కల్పించాలి

### - కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాదగోని జంగయ్య గౌడ్



**మంచాల, సెప్టెంబర్ 21 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కిసాన్ సెల్ అధ్యక్షుడు కావాలి బుగ్గరాములు ముదిరాజ్ గతనలభై సంవత్సరాలనుండి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూతన కుటుంబం నుండిరెండు సార్లు పోటీ చేయటం జరిగిందని, ఆనాడు కాంగ్రెస్ జరిగిన గొడవలవల్ల ఓడిపోవడం జరిగింది. అయినా అప్పటి నుండి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ పార్టీ కార్యక్రమాల్లో పాలు పంచు కుంటూ అధికారం ఉన్న లేకపోయినా నేను ఉన్నాను అంటూ కాంగ్రెస్ కార్యకర్త లకు ధైర్యం చెప్పు కుంటూ ఇతర పార్టీలోకి వెళ్లకుండా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్న గొప్ప నాయకుడు కావలి బుగ్గరాములు ముదిరాజ్ అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోఉన్న సమయంలో కూడ కావాలి బుగ్గ రాములు ముది రాజ్ కు ఎలాంటి నామినేటెడ్ పదవి ఇవ్వలేదన్నారు. ఇప్పటివరకు కూడా మేజర్ గ్రామపంచాయతీ అయినా ఆరుట్ల గ్రామానికి ఏ ఒక్క నాయ కుడికి కూడా ఇప్పటివరకు పార్టీ అధిష్టానం నామినేటెడ్ పదవి ఇచ్చి నదాఖలాలు లేవన్నారు. పార్టీ అధి ష్టానం ఆరుట్ల గ్రామం పై దృష్టి పెట్టి కాంగ్రెస్ పార్టీలో సీనియర్ బీసీ నాయకుడైన కావాలి బుగ్గరాములు ముదిరాజ్ కు ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ లో చోటు కల్పిం చాల ని పార్టీ అధిష్టానాన్ని కోరుతు న్నాము అలాగే ఇబ్రహీంపట్నం ని యోజకవర్గంలోకాంగ్రెస్ పార్టీ లో కొన్ని సంవత్సరాలుగా పార్టీ కోసం పని చేస్తున్న సీనియర్ నాయకులను గుర్తించి నామినేటెడ్ కమిటీలలో చోటు కల్పించాలి పార్టీ పదవుల్లో చోటు కల్పించాలని ఈ సందర్భంగా మీడియా ద్వారా పార్టీ అధిష్టానాని కోరుతున్నామన్నారు.

## మంత్రులు, ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలియజేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధు'









**తుర్కయంజాల్, సెప్టెంబర్ 21 (శాసన సభ ):** తెలంగాణలోనే అతిపెద్దదైన మార్కెట్ యార్డుకు చైర్మన్‌గా తన నియామకానికి సహకరించిన తుమ్మల నాగేశ్వరరావును, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డికి శనివారం చిలుక మధుసూదన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పురపాలక సంఘం పరిధిలోని తొర్రూరులోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో జరిగిన ఈ కార్యక్రమంలో మల్‌రెడ్డి యాదిరెడ్డి, ఎమ్మెల్యే తనయుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ బాస్కర చారి,నూతన డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, అంజయ్య, మేకం లక్ష్మి,మచ్చేందర్ రెడ్డి..రఘుపతి రెడ్డి,గణేష్ నాయక్,నరసింహ,బండి మధుసూదన్ రావు,నవరాజ్,గోవర్ధన్ రెడ్డి..వెంకట్ గుప్తా,ఇబ్రహీం. తదితరులు పాల్గొన్నారు.

( మొదటి పేజీ తరువాయి )

## రాహుల్ గాంధీపై కర్ణాటకలో ఎఫ్ఐఆర్ నమోదు

లోక్ సభలో ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై కర్ణాటకలో ఎఫ్ఐఆర్ నమోదైంది. కొన్ని వర్గాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడంతో పాటు రిజర్వేషన్లను తొలగిస్తామని వ్యాఖ్యలు చేసినందుకు గాను ఆయనపై ఈ ఎఫ్ఐఆర్ నమోదైంది. అమెరికా పర్యటనలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దీంతో కర్ణాటక బీజేపీ నేతలు రాహుల్ గాంధీపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బెంగళూరులోని హైగ్రౌండ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు ఆందోళన కలిగించాయని, ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదైందని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయా ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. బీజేపీ ఉండగా... ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు తొలగించే కుట్రలో రాహుల్ గాంధీ ఎన్నటికీ విజయం సాధించలేరని పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ... కొన్ని అంశాలపై భారత్‌లో ఘర్షణలు జరుగుతున్నాయన్నారు. ఆదివాసీలు, దళితులు, ఓబీసీలకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదన్నారు. దేశంలో ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు, మైనార్టీల జనాభా 90 శాతం ఉందని, కానీ దేశంలోని మొదటి 200 వ్యాపారుల్లో, అత్యున్నత న్యాయస్థానాల్లో, మీడియాలో వీరి భాగస్వామ్యం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వంలో 78 మంది కార్యదర్శులు ఉంటే వీరిలో ఒకే ఒక్క గిరిజనుడు, ముగ్గురు దళితులు, ముగ్గురు ఓబీసీలు, ఒక్క మైనార్టీ మాత్రమే ఉన్నారని రాహుల్ గాంధీ తెలిపారు. కులగణన ద్వారానే దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల స్థితిగతులు తెలుస్తాయన్నారు. అందరికీ సమానమైన అవకాశాలు ఉన్నప్పుడు రిజర్వేషన్లు రద్దు చేయడం గురించి ఆలోచిస్తామని రాహుల్ వ్యాఖ్యానించారు. అయితే ఇప్పుడు భారత్‌లో అందరికీ సమాన అవకాశాలు లేవన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ అక్రమాలను బయటపెడతాం: కేటీఆర్

సీఎం తన అధికారాన్ని ఉపయోగించి బావమరిదికి పనులు అప్పగించారని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు."సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది కంపెనీకి రూ.1,137 కోట్ల పనులు అప్పగించారు. రూ.2 కోట్ల లాభం ఉన్న కంపెనీ రూ.1000 కోట్ల విలువైన పనులు చేస్తుందా? అమృత్ పథకంలో జరిగిన టెండర్ల వివరాలను ప్రభుత్వం బయటపెట్టడం లేదు. టెండర్లపై కేంద్రం విచారణ జరిపించాలి. ఇప్పటి వరకు జరిగిన అమృత్ పథకం టెండర్లను రద్దు చేయాలి. ఈ టెండర్ల అవినీతిపై కేంద్రానికి లేఖ రాశాం. ప్రభుత్వం చేసిన అక్రమాలన్నీ బయటపెడతాం" అని కేటీఆర్ అన్నారు.

## జానీ మాస్టర్ కేసులో మరో ట్విస్ట్,,, ఆయన భార్యపై కూడా కేసులు



**శాసనసభ / హైదరాబాద్:** లేడీ కొరియోగ్రాఫర్‌పై లైంగిక వేధింపుల కేసులో జానీ మాస్టర్ అరెస్టయిన విషయం తెలిసిందే. హైదరాబాద్ పోలీసులు ఆయన్ను గోవాలో అరెస్ట్ చేసి నగరానికి తీసుకొచ్చారు. సెప్టెంబర్ 20న ఉప్పరలపల్లి కోర్టులో హాజరుపరచగా.. ఆయనకు న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. ఇక ఈ వ్యవహారంలో జానీ మాస్టర్ భార్య అయేషా అలియాస్ సుమలత చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. జానీ మాస్టర్‌తో పాటుగా అయేషా కూడా బాధిత యువతిని పలుమార్లు బెదిరించినట్లుగా పోలీసులు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు.

## గంజాయి సరఫరా చేస్తున్న ముఠా అరెస్ట్



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 21(శాసన సభ) :** గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను అదుపులోకి తీసుకుని వారి నుంచి గంజాయి చాక్లెట్లు, హాష్ ఆయిల్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీనగర్ లోని సీపీ కార్యాలయంలో రాచకొండ పోలీస్ కమిషనర్ రాచకొండ సీపీ సుధీర్ బాబు మాట్లాడుతూ ఆంధ్ర సరిహద్దు రాష్ట్రాల నుండి గంజాయిని అడ్డదారిలో తెలంగాణ రాష్ట్రానికి తరలిస్తూ లక్షలాది రూపాయలకు విక్రయిస్తున్న ముఠాను పోలీసులు చాకచక్యంగా పట్టుకొని వారి నుండి రెండున్నర కేజీల హాష్ ఆయిల్ మూడున్నర , గంజాయి చాక్లెట్లను చేసుకున్నామని వెల్లడించారు.బీహార్ రాష్ట్రం సమిష్టి పూర్ , సీమాత్మ జిల్లాల నుండి సంతోష్ కుమార్ వీరేందర్ సింగ్ లు అక్కడ తక్కువ ధర కు కొనుగోలు చేసి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం అన్నవరం నుండి తెలంగాణకు సరఫరా చేస్తూ లక్షలాది రూపాయలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. డబ్బు సంపాదనే ధ్యేయంగా ఎంచుకున్న వీరు గతంలో కూడా పలుమార్లు గంజాయి సరఫరా చేస్తూ పలు కేసులలో నిందితులుగా ఉన్నారు. వీరిపై పీడీ యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని సీపీ సుధీర్ వెల్లడించారు.

( మొదటి పేజీ తరువాయి )

## ఆ ఏడుకొండలవాడే నాతో లడ్డూ గురించి మాట్లాడించాడేమో!: సీఎం చంద్రబాబు

అయోధ్యలో కూడా తిరుమల లాంటి లడ్డూ తయారు చేయాలని చూశారు. ఇక్కడ నుంచి కార్మికులను తీసుకువెళ్లారు. కానీ సాధ్యం కాలేదు. ఈ విషయం నాకు అక్కడి వారే చెప్పారు. అంత మహత్యం ఉన్న ప్రసాదం అది.రాములవారి విగ్రహం తల తొలగిస్తే దిక్కులేదు.గత ప్రభుత్వ హయాంలో దేవాలయాల్లో అనేక అపచారాలు జరిగాయి. రామతీర్థంలో రాములవారి విగ్రహం తల తొలిగిస్తే దిక్కులేదు... కనీసం చర్యలు తీసుకోలేదు. ఇలా ఒకటని కాదు... నాటి ప్రభుత్వం చెయ్యని తప్పులేదు. నాడు ప్రజల సెంటిమెంట్ తో ఆడుకున్నారు. ప్రజల మనోభావాలకు విలువ ఇవ్వలేదు.పోలవరం, అమరావతి నాశనం చేసి... ప్రశ్నించిన వారిపై ఎదురుదాడి చేసి తప్పుడు ప్రచారం చేశారు. బాబాయి హత్య విషయంలో ఎలా బుకాయించారో... నేడు ప్రకాశం బ్యారేజ్ కు బోట్ల విషయంలోనూ అలాగే మాట్లాడుతున్నారు. వైసీపీ నాయకులు నేరాలు చేసి....ఎదురుదాడి, బుకాయింపు, ఫేక్ ప్రచారం అనే సిద్ధాంతంతో పనిచేస్తున్నారు తప్ప... బాధ్యత అనేది లేదు. అందుకే వీళ్లను కొలంబియా నేరస్తుడు, మాఫియా డాన్ పాబ్లో ఎస్కోబార్ తో పోల్చాను.గతంలో వైఎస్ ఏడు కొండలు కాదు... రెండు కొండలు అన్నాడు కేరళ గురువాయూర్ టెంపుల్ లో దర్శనానికి చొక్కా విప్పి వెళ్లాలి.....అది సాంప్రదాయం. అందరూ పాటించాలి. ప్రతి మతానికి కొన్ని ఆచారాలు, సాంప్రదాయాలు ఉన్నాయి. వాటిని ప్రతి ఒక్కరు గౌరవించాలి. గతంలో వైఎస్ ఏడు కొండలు కాదు రెండు కొండలు అన్నాడు... అప్పుడు వ్యతిరేకించాం, పోరాడాం. అమరావతిలో రూ.250 కోట్లతో శ్రీవారి టెంపుల్ కడదాం అనుకుంటే దాన్ని కుదించారు. వీళ్లు మళ్లీ ఇప్పుడు పెద్దపెద్ద మాటలు చెబుతున్నారు" అంటూ చంద్రబాబు మండిపడ్డారు.

## మేడిగడ్డ బ్యారేజీ 3, 4, 5 బ్లాక్‌లలో సమస్యలు ఉన్నాయి

విచారణ సందర్భంగా ఇంజినీర్లు పలు అంశాలను కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. మేడిగడ్డ ఆనకట్ట అంచనా వ్యయం పెరుగుదల, బ్యాంకు గ్యారెంటీలు, కుంగుబాటు గురించి ఎస్ఈ, ఈఈలను కమిషన్ ప్రశ్నించింది. మేడిగడ్డలోని పలు బ్లాకుల్లో సమస్యలు ఉన్నట్లు ఐఐటీ బృందం గుర్తించిందని తెలిపారు. తగిన చర్యలు తీసుకున్నప్పటికీ పరిష్కారం కాలేదని తెలిపారు.అంచనా వ్యయం పెంపు, బ్యాంకు గ్యారెంటీలకు సంబంధించిన ప్రశ్నలకు వారి నుంచి సమాధానం రాలేదు. అన్నారం డిజైన్ సరిగా లేదని సంబంధిత ఈఈ వెల్లడించారు. వరదలను సెకనుకు ఐదు మీటర్లు తట్టుకునేలా రూపొందిస్తే 18 మీటర్ల వరకు వరద వస్తోందని ఇంజినీర్లు వెల్లడించారు. అన్నారం బ్యారేజీ అలైన్‌మెంట్ సరిగ్గా లేకపోవడంతో సమస్యలు వస్తున్నట్లు తెలిపారు.


## తిరుమల శ్రీవారి లడ్డూ వివాదం.. బీజేపీ ఫైర్ బ్రాండ్ మాధవీలత సంచలన కామెంట్స్



**శాసనసభ / హైదరాబాద్:** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీ అంశం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. లడ్డూ తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపినట్లు ఏపీ సీఎం చంద్రబాబు కామెంట్ చేయటం సంచలనంగా మారింది.ఈ అంశం దేశవ్యాప్తంగా అలజడి సృష్టించింది. శ్రీవారి ప్రసాదాన్ని హిందువులు పరమ పవిత్రంగా భావిస్తారు. అటువంటి లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలుపుతున్నారనే విషయం బయటకు రావటం చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై కేంద్రమంత్రి నడ్డా ఏపీ సీఎం చంద్రబాబును వివరణ కూడా కోరారు. పూర్తి నివేదిక సమర్పించాలన్నారు.

శాసనసభ
ఆదివారం 22 సెప్టెంబర్ - 2024

# ఫార్మాసిటీ అక్కడే ఉంటుందా.. లేదా?



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (శాసనసభ ):** రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి గ్రామంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ రద్దు కాలేదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది.కానీ, మేడిపల్లిలోనే ఫార్మాసిటీని కొనసాగించేదీ లేనిదీ స్పష్టత ఇవ్వకపోవడంతో న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశంపై ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదని, మేడిపల్లిలో సేకరించిన భూముల్లోనే ఫార్మాసిటీని కొనసాగిస్తారో లేదో చెప్పడానికి ఎన్ని వాయిదాలు తీసుకుంటారని నిలదీసింది. ఫార్మాసిటీ భూములపై ధరణిలో లావాదేవీలకు అనుమతించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లాకు చెందిన డీవీవీ సత్యకొండలరాయ తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ శనివారం విచారణ జరిపారు.ఫార్మాసిటీ వివరాలను సమర్పించేందుకు మరోసారి గడువు ఇవ్వాలని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోరగా.. అందుకు న్యాయమూర్తి నిరాకరించారు. ఫార్మాసిటీ రద్దయినట్టు పత్రికల్లో వచ్చిన కథనాలను పిటిషనర్లు సమర్పించినప్పటికీ ప్రభుత్వం మాత్రం స్పష్టత ఇవ్వడంలేదని తప్పుపట్టారు. ఫార్మాసిటీ భూములకు సంబంధించిన పిటిషన్లపై సోమవారం విచారణ చేపడతామని, ఆ లోగా ప్రభుత్వ నిర్ణయంతోపాటు ఫార్మాసిటీకి సంబంధించిన అన్ని వివరాలను తెలియజేయాల్సిందేనని తేల్చిచెప్పారు.యథావిధిగా ఫార్మాసిటీ కాగా, ఫార్మాసిటీ యథాతథంగా కొనసాగుతుందంటూ హైకోర్టులో ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఫార్మాసిటీ రద్దయినట్టు కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఆ అఫిడవిట్‌లో పేర్కొంటూ.. 2016లో జారీ చేసిన జీవో 31 ప్రకారం ఫార్మాసిటీ యథావిధిగా కొనసాగుతుందని వెల్లడించారు. గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, దాన్ని రద్దు చేసేందుకు ఎలాంటి విధాన నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు కోసం మేడిపల్లిలో 1,700 ఎకరాల సేకరణకు భూసేకరణ చట్టంలోని సెక్షన్ 11(1) కింద గతంలో ప్రాథమిక నోటిఫికేషన్ వెలువడిందని గుర్తుచేశారు. అంతకుముందు ఇదే ఫార్మాసిటీ ఏర్పాటు కోసం 2016లో ప్రభుత్వం జీవో 31ను జారీ చేసిందని, అంతేకాకుండా భూసేకరణ చట్టం కింద కొన్ని మినహాయింపులు ఇస్తూ జీవో 46ను జారీ చేసిందని తెలిపారు.డిక్లరేషన్, పరిహారం అవార్డు నిబంధనల ప్రకారం జరగలేదన్న ఆరోపణలు అవాస్తవమని, భూసేకరణ చట్టంలోని నిబంధనల ప్రకారమే అక్కడ భూసేకరణ చేపట్టామని పేర్కొన్నారు. ప్రభుత్వం సేకరించిన భూముల్లో పిటిషనర్‌కు సంబంధించిన 10 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. డిక్లరేషన్ అవార్డుపై పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారని, ఆయన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. అభ్యంతరాల స్వీకరణ సహా భూసేకరణ ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించిందని వివరించారు. ఈ ఆదేశాల ప్రకారం భూసేకరణకు సంబంధించిన ప్రాథమిక నోటిఫికేషన్ అమల్లోనే ఉన్నదని, ఈ నేపథ్యంలో సదరు భూములపై ధరణి పోర్టల్‌లో లావాదేవీలకు అనుమతించాలన్న పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. పిటిషనర్ తన భూములపై ధరణి పోర్టల్ ద్వారా ఎలాంటి లావాదేవీలు నిర్వహించలేరని పేర్కొన్నారు.భూసేకరణ ప్రక్రియ అమల్లో ఉన్నందున ధరణలో ఎంట్రీల కోసం పిటిషనర్ చేసుకున్న దరఖాస్తును అనుమతించలేమని స్పష్టం చేశారు. అంతేకాకుండా అవార్డు నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీళ్లు దాఖలు చేశామని, అవి ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. భూసేకరణ నిమిత్తం రెండు పత్రికల్లో నోటిఫికేషన్‌ను ప్రచురించామని, గ్రామసభ నిర్వహించి నోటీసులు జారీచేయడంతోపాటు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు ఆవశ్యకతను అందరికీ వివరించామని చెప్పారు.ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములకు ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున్న పరిహారం ఇవ్వాలని తొలుత నిర్ణయించినప్పటికీ ఆ తర్వాత దాన్ని రూ.16 లక్షలకు పెంచామని, దానికి అదనంగా రైతులకు 121 చదరపు గజాల చొప్పున స్థలాలను కూడా కేటాయిస్తున్నామని వివరించారు. అవార్డు నోటిఫికేషన్‌పై పిటిషనర్ ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని, నోటీసులకు సమాధానం ఇవ్వనందున అధికారులు జారీ చేసిన పరిహారం మొత్తాన్ని భూసేకరణ అథారిటీ వద్ద డిపాజిట్ చేశామని తెలిపారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**శాసనసభ /హైదరాబాద్ :** హైదరాబాద్ లో భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. తక్కువ సమయంలో ఎక్కువ వర్షం పడడంతో నాళాల వద్ద వరద ప్రవాహం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని మాన్ హోల్స్ వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.వాతావరణ శాఖ హెచ్చరికలతో నగరంలో వచ్చే రెండు గంటల పాటు భారీ వర్షం కురిసే అవకాశం ఉండడంతో జీహెచ్ఎంసీ, హెచ్ఎండిఎ , వాటర్ వర్క్స్ , విద్యుత్ ,పోలీస్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. డిఆర్ఎఫ్ , ఎన్డిఆర్ఎఫ్ బృందాలు , ఇతర విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.హైదరాబాద్ లో భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాల్లో ,ముంపు ప్రాంతాల్లో ఇబ్బందులు లేకుండా ఉండడంతో పాటు , ప్రాణ నష్టం జరగకుండా చూసుకోవాలని అధికారులకు తెలిపారు. హైదరాబాద్ లో భారీ వర్షం కురిసినప్పుడు నీళ్ళు నిల్వ ఉండే 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద జీహెచ్ఎంసీ సిబ్బంది అక్కడే ఉండి నీళ్ళు వెంటనే వెళ్ళేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైతే వర్షం కురిసి ఇబ్బందులు ఉన్నాయో ఆయా ప్రాంతాల్లో అధికారులకు ప్రజలు పిర్యాదు చేసిన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు.. సమస్య తీవ్రమైతే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అధిక వర్షపాతం ఉన్న ప్రదేశాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఇక్కడ జిహెచ్ఎంసి బృందాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# నిబద్ధతగల నేత సీతారాం ఏచూరి



**రవీంద్రభారతి, సెప్టెంబర్ 21(శాసనసభ) :** పదవుల చుట్టూ పరిభ్రమించే ఈనాటి రాజకీయ నేతల్లో స్థిరంగా సిద్ధాంతం కోసం నిలిచిన నిబద్ధత గల ఆదర్శ నాయకుడు సీతారాంఏచూరి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు.ఎవరు ఏ సమయంలో ఏ పార్టీ కండువా మారుస్తారో తెలియని ఫిరాయింపుల కాలంలో కడదాకా కమ్యూనిస్టుగా బతికిన నాయకుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. నేటి తరం రాజకీయ నాయకులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.ఢిల్లీలో వెలిగిన అసలైన హైదరాబాద్ బిడ్డ ఏచూరి అంటూ నివాళులర్పించారు. ఇటీవల ఢిల్లీలో కన్నుమూసిన సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభను శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అధ్యక్షత వహించిన ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ.. ఏచూరి హైదరాబాద్‌లోని ఆల్ సెయింట్స్ స్కూల్ చదువుకున్నారని, ఆ పాఠశాల పక్కనే ఉన్న గ్రామర్ స్కూల్‌లో చదివానని తెలిపారు. తామిద్దరం నిజాం కాలేజీలోనే డిగ్రీ పూర్తి చేశామని చెప్పారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడుతూ.. ఓట్ల రాజకీయాల్లో వెనుకబడ్డాం.. ప్రజల కోసం చేసిన పోరాటాలలో ముందున్నామని ఏచూరి అనేవారని గుర్తుచేశారు. విద్యావంతుల కుటుంబంలో పుట్టిన ఏచూరి ప్రశ్నించే గొంతుకగా ఎదగడం చాలా గొప్ప విషయమని అన్నారు. పోరాటాల నుంచే వచ్చే నాయకునికి ప్రజల కష్టాలు, సుఖ దుఃఖాలు తెలుసునని చెప్పారు. తిట్లు, రోత మాటలే రాజకీయంగా చలామణి అవుతున్న ఈ రోజుల్లో ఏచూరి ఎంతో హుందాగా వ్యవహరించేవారని తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో జేఎన్‌యూ వైస్‌చాన్స్‌లర్‌గా ఉన్న మాజీ ప్రధాని ఇందిరాగాంధీని ఆమె ఎదుటే నిలిచి రాజీనామా చేయాలని డి మాండ్ చేసిన గుండెధైర్యం గల నాయకుడు ఏచూరి అని కొనియాడారు. సిద్ధాంతపరంగా తమ పార్టీలు వేరైనా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును సీపీఎం వ్యతిరేకించినా.. పోరాటాలపరంగా తమ రెండు పార్టీల రక్తం ఒక్కటేనని వ్యాఖ్యానించారు.ఏచూరి మృతి దేశానికి తీరని లోటు: యూపీఏ ప్రభుత్వ హయాంలో పేదలకు ఉపయోగపడే కీలక బిల్లుల ఆమోదం విషయంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారని తెలిపారు. ఏచూరిని రాహుల్‌గాంధీ మార్గనిర్దేశకుడిగా భావిస్తారని చెప్పారు. దేశంలో జమిలి ఎన్నికల ముసుగులో ఆధిపత్యం చేలాయించాలన్న కుట్ర జరుగుతున్నదని మండిపడ్డారు. రాష్ట్రాల హక్కులను కాపాడాల్సిన ఇలాంటి సందర్భంలో ఏచూరి లేకపోవడం భారీ లోటు అని అన్నారు.వివిధపార్టీల నాయకులు తొలుత ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, ముఠాగోపాల్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, సీపీఎం నేత బీవీ రాఘవులు, సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఉమ్మడి ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి మోహన్‌కందా తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా, జపాన్ పర్యటనకు బయలుదేరిన

# డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**శాసనసభ / హైదరాబాద్ :** పెట్టుబడులను ఆకర్షించేందుకు, అక్కడి మైనింగ్, గ్రీన్ పవర్ రంగాలపై అధ్యయనం చేసేందుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, అధికారుల బృందంతో కలిసి శనివారం అమెరికా , జపాన్‌ల పర్యటనకు బయలుదేరారు.ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, ఉప ముఖ్యమంత్రి వెంట ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఆర్థిక) కె రామకృష్ణారావు, ఇంధన కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరామ్, డిప్యూటీ సిఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.ఈ పర్యటనలో ఉపముఖ్యమంత్రి ప్రముఖ కంపెనీల ప్రధాన కార్యాలయాలను సందర్శిస్తారు , మైనింగ్ , గ్రీన్ పవర్ రంగాలకు సంబంధించిన అంతర్జాతీయ ఎక్స్‌పోలో పెట్టుబడిదారులతో సమావేశమవుతారు. సెప్టెంబర్ 24, 25 తేదీల్లో లాస్ వెగాస్‌లో జరిగే ఇంటర్నేషనల్ మైనింగ్ ఎక్స్‌పోలో పాల్గొని వివిధ కంపెనీల సీఈవోలు, ప్రతినిధులతో ఈ బృందం చర్చలు జరుపుతుంది. సెప్టెంబర్ 27న, భట్టి లో అతిపెద్ద సింగిల్ సోలార్ , బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్ట్ అయిన ఎడ్వర్డ్స్ , సాన్‌బార్న్ సోలార్ ఫెసిలిటీని సందర్శిస్తారు. ఈ బృందం సెప్టెంబర్ 28న పెట్టుబడిదారులు , సాంకేతిక నిపుణులతో సంభాషించి, మరుసటి రోజు టోక్యోకు బయలుదేరుతుంది.

# ఐఐటీలో చదువుతూ గంజాయి దందా



**హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 21 (శాసనసభ):** దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో విద్యాభ్యాసం..కానీ, చెడు వ్యసనాలకు అలవాటు పడి గంజాయి అమ్ముతూ పట్టుబడ్డారు ఇద్దరు ఐఐటీ విద్యార్థులు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, ఎస్‌టీఎఫ్ ఈఎస్ నంద్యాల అంజిరెడ్డి కథనం ప్రకారం.. ఏపీలోని నెల్లూరుకు చెందిన కొలి మణికంఠ చౌదరి, గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన పవన్.. తమిళనాడులోని ఐఐటీ క్యాంపస్‌లో చదువుతున్నారు.చెడు వ్యసనాలకు అలవాటు పడి గంజాయి అమ్మి డబ్బు సంపాదించుకోవాలని నిర్ణయించుకున్నారు.ఎవరికీ అనుమానం రాకుండా హైదరాబాద్‌లోని ఎస్ఆర్‌నగర్‌లో ఉన్న ఓ హాస్టల్‌లో తమ దందా నడుపుతున్నారు. రూ.వెయ్యికి 20 గ్రాములు చొప్పున అమ్ముతున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి హాస్టల్‌పై దాడిచేసి ఇద్దరిని అరెస్టుచేశారు. వారి వద్ద 1.2 కిలోల గంజాయితో పాటు 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.వీరికి గంజాయి సరఫరా చేస్తున్న వైజాక్‌కు చెందిన కమలేశ్, అమోశ్‌పై కేసు నమోదుచేశారు. నిందితుల వద్ద గంజాయి కొనుగోలు చేసిన 22 మందిని గుర్తించి, వారిపైనా కేసులు పెట్టారు. అదేవిధంగా, నెల్లూరు జిల్లాకు చెందిన ఎర్రగంటి లోకేశ్.. నగరంలోని ఒక ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. గంజాయి మత్తుకు అలవాటు పడటంతో ఉద్యోగం పోయింది.గంజాయి విక్రయాలనే వృత్తిగా మార్చుకున్న లోకేశ్.. మణికొండలో ఇల్లు అద్దెకు తీసుకుని దందా కొనసాగించాడు. సమాచారం అందుకున్న ఆబ్కారీ అధికారులు.. నిందితుడిని అరెస్టు చేసి, అతడి వద్ద 1.74 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరా చేసిన నెల్లూరు వాసి శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశారు.

# సీఎం సాక్షిగా ఎంపీ మల్లు రవికి అవమానం




**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (శాసనసభ ):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన దళిత ఎంపీ మల్లు రవికి అవమానం ఎదురైంది.సీపీఎం నేత సీతారాం ఏచూరి సంస్మరణ సభకు హాజరైన మల్లు రవి వేదికపై రెండో లైన్‌లో కూర్చున్నారు. మొదటి వరుసలో సీపీఎం జాతీయ నేతలు, సభాధ్యక్షుడు, ముఖ్య అతిథి సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు.సభకు ముందుగానే వచ్చిన మల్లు రవి సీఎం రేవంత్‌రెడ్డి కోసం ఏర్పాటుచేసిన కుర్చీకి సరిగ్గా వెనుక వరుస సీటులో కూర్చున్నారు. దీంతో దళిత ఎంపీకి జరిగిన అవమానంపై దళితవర్గాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.ఖండించిన బాల్కసుమన్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి దళిత ప్రజాప్రతినిధులను అవమానిస్తూనే ఉన్నదని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏచూరి సంస్మరణ సభలో దళిత ఎంపీ మల్లు రవిని సీఎం రేవంత్‌రెడ్డి సెక్యూరిటీ సిబ్బంది బలవంతంగా లేపి అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ఒక సిట్టింగ్ దళిత ఎంపీ అయిన మల్లు రవి సీఎం వెనకాల రెండో వరుసలో కూడా కూర్చోడానికి అర్హుడు కాదా? అని నిలదీశారు. ఇందుకు సంబంధించిన వీడియోను శనివారం ఎక్స్‌లో పోస్టుచేసి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

# రాష్ట్రంలో ప్రబలుతున్న విషజ్వరాలు



**శాసనసభ / మెదక్ :** ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఆస్పత్రుల్లో రోగుల తాకిడి పెరిగింది. సంగారెడ్డి జిల్లా ఆస్పత్రిలో ప్రతి రోజు 1600 నుంచి 1800 మంది పేషేంట్స్ అనారోగ్యంతో వైద్యులని ఆశ్రయిస్తున్నారు.రెండ్రోజులకు మించి జ్వరం వస్తే డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా టెస్టులు చేయించుకోవాలని సంగారెడ్డి జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ సలహా ఇస్తున్నారు. ప్రబలుతున్న విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.. విషజ్వరాల కారణంగా ప్రజలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ఇలా వచ్చే వారిలో ఎక్కువగా విష జ్వరంతో పాటు డెంగ్యూ, చికెన్ గున్యా వంటి లక్షణాలతో ఆస్పత్రులకు క్యూకడుతుండగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు పేషెంట్లతో కిటకిటలాడుతున్నాయి.. జ్వరం ఉంటే నిర్లక్ష్యం చేయొద్దని, ఆందోళనకు గురికావద్దని.. క్వాలిఫైడ్ డాక్టర్ ను మాత్రమే సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు.ఇదిలా ఉంటే.. భిక్కనూరు పీహెచ్ సీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన జ్వర సర్వేను ఆరోగ్య విస్తరణ అధికారి వేంకట రాములు పరిశీలించారు. మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు జ్వర సర్వే నిర్వహించారు. ఈ సర్వేను పరిశీలించి ఆయన మాట్లాడారు. ఇండ్ల ముందు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఆయన వెంట సెక్రటరీ లక్ష్మీ, ఏఎన్ఎం శ్యామల, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, ఆశావర్కర్లు వనజ, రేణుక, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీలను సమర్థవంతంగా నిర్వహించడానికి కృషి చేశాం



**శాసనసభ / ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు శనివారం మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..ఆదిలాబాద్ ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యం అందించండం కోసం బైక్ అంబులెన్సు ఎంతో ఉపయోగ పడుతుందని ఆమె అన్నారు. కంటైనర్ స్కూల్ మా ప్రాంతంలో ఏర్పాటు చేశామని, గ్రామీణ ప్రాంతంలో వైద్యులు రాక ఇబ్బంది పడుతున్నామన్నారు మంత్రి సీతక్క. పట్టణ ప్రాంతాల్లో ఉన్నవారిని గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడం కోసం పంపించామని, గ్రామీణ ప్రాంత బిడ్డలకు సేవ చేయడం వృత్తికి ఇచ్చే గౌరవమన్నారు మంత్రి సీతక్క. మెడికల్ కాలేజీలు క్యాన్సిల్ చేసే దశలో ఉన్న వాటికి మేము జీవం పోసామని, మెడికల్ కాలేజీలను సమర్థవంతంగా నిర్వహించడానికి కృషి చేశామన్నారు. అంతేకాకుండా.. మారుమూలా అటవీ ప్రాంతాల్లో ఎంత సేవ చేస్తే అంత మంచి పేరు సంపాదించవచ్చు అని, కష్టమైనా ఇష్టంగా మలుచుకొని ట్రైబల్ ఏరియాలో పనిచేయండన్నారు సీతక్క. ముఖ్యంగా వైద్యులు ముందుకు వచ్చి గిరిజన గ్రామాల్లో సేవ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజాపాలన పేరిట ఉత్సవాలెందుకు?



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (శాసనసభ ):** కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 17న ప్రజాపాలన పేరిట ఉత్సవాలు నిర్వహించడమెందుకో అర్థం కాలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు.హైదరాబాద్‌లోని సీపీఐ కార్యాలయం(ముగ్దుంభవన్)లో శనివారం విలేకరులతో మాట్లాడారు. తొలి తెలంగాణ పోరాట యోధులు సురవరం సుధాకర్‌రెడ్డి, చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజీ పేర్లను యూనివర్సిటీలకు పెట్టడం, గద్దర్ పేరిట అవార్డులు అందజేయడాన్ని అభినందించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఎన్ బాలమల్లేశ్, కలవేణ శంకర్, ఎం బాలనర్సింహా పాల్గొన్నారు.సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్నరు..తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ తమ చరిత్రగా చెప్పుకునేందుకు కొన్ని పార్టీ లు కుట్రలు పన్నుతున్నాయని పలువురు వక్తలు మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వారోత్సవాల ముగింపు సభ శనివారం రావి నారాయణరెడ్డి ఆడిటోరియం లో ఘనంగా నిర్వహించారు. సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభకు ప్రొఫెసర్ హరగోపాల్, ఆంధ్రజ్యోతి సంపాదకుడు కే శ్రీనివాస్ హాజరై మాట్లాడారు.

## ప్రకాష్‌రాజ్‌కు మంచు విష్ణు స్ట్రాంగ్ కౌంటర్




తిరుమల లడ్డూ వ్యవహారంలో ప్రకాష్‌రాజ్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు మా అధ్యక్షుడు మంచు విష్ణు. 'ప్రకాష్‌రాజ్ మీరు ఇలాంటి మాటలు మాట్లాడాల్సిన అవసరం లేదు.తిరుమల లడ్డూ కేవలం ప్రసాదం మాత్రమే కాదు. నాలాంటి కోట్లాది హిందువుల విశ్వాసానికి ప్రతీక. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేయాలని ఇప్పటికే కోరారు. ఇందులో మతపరమైన వ్యాఖ్యలు ఎక్కడున్నాయి?మీ పరిధుల్లో మీరు ఉండండి.' అని మంచు విష్ణు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.ఆ మధ్య జరిగిన 'మా' ఎన్నికల సమయంలో మంచు విష్ణు, ప్రకాశ్ రాజ్‌ల మధ్య ఎటువంటి వార్ నడిచిందో తెలియంది కాదు. దేశవ్యాప్తంగా ఈ ఎన్నికల గురించి మాట్లాడుకోవడం విశేషం. ఆ ఎన్నికలలో మంచు విష్ణు గెలిచి.. 'మా' బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత వీరిద్దరూ కామ్‌గా ఎవరిపని వారు చేసుకుంటూ వెళుతున్నారు. మళ్లీ ఇన్నాళ్లకూ తిరుపతి లడ్డు కల్తీ విషయంలో పవన్ కళ్యాణ్ చేసిన ట్వీట్‌పై మాటల యుద్ధానికి దిగారు.

## ఆయనతో వర్క్ చేయటం డ్రీమ్ కమ్ ట్రు అనిపించింది : మంజు వారియర్



సూపర్‌స్టార్ రజినీకాంత్ టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'వేట్టైయాన్- ది హంటర్'. దసరా సందర్భంగా అక్టోబర్ 10న రిలీజ్ అవుతుంది. కె.ఇ.జ్ఞానవేల్ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ సంస్థ బ్యానర్‌పై సుభాస్కరన్ ఈ ను నిర్మించారు.శుక్రవారం ఈ ఆడియో వేడుకల చెన్నైలో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో..వేట్టైయాన్ మూవీ టీమ్ పాల్గొంది. ఈ ఈవెంట్ లో సూపర్ స్టార్ రజినీకాంత్ మాట్లాడుతూ.. "వేట్టైయాన్- ది హంటర్' నిర్మాణం చేసిన లైకా ప్రొడక్షన్స్ సంస్థకి, మంజు వారియర్, రానా దగ్గుబాటి సహా ఇతర నటీనటులకు, కు వర్క్ చేసిన టెక్నీషియన్స్, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ అందరికీ ధన్యవాదాలు అన్నారు.

## 18వ చిత్రం కోసం 12 ఎకరాల్లో



సాయి దుర్గాతేజ్ కథానాయకుడిగా ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. రోహిత్.కె.పి దర్శకత్వం వహిస్తున్నారు.కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మాతలు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయింది. కొన్ని యాక్షన్ ఘట్టాల్ని తెరకెక్కించారు. తదుపరి షెడ్యూల్ చిత్రీకరణ కోసం 12 ఎకరాల్లో భారీ సెట్స్‌ని తీర్చిదిద్దుతున్నారు. ప్రేక్షకులకు సరికొత్త అనుభవాన్ని పంచనున్న ఓ గాఢమైన కథ ఇది, సాయి దుర్గా తేజ్ మాస్ అవతారంలో అలరిస్తారని సినీ వర్గాలు తెలిపాయి. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం కోసం అత్యున్నత సాంకేతిక బృందం పనిచేస్తోందని పేర్కొన్నాయి.




## మహేష్ మేనల్లుడితో సితార కొత్త మూవీ..!

సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో ఓ పక్క భారీ సినిమాలు చేస్తూనే మరోపక్క యువ హీరోలతో వైవిధ్యమైన సినిమాలను నిర్మిస్తున్నారు నిర్మాత సూర్యదేవర నాగ వంశీ.లేటెస్ట్ గా సితార బ్యానర్ నుంచి మహేష్ మేనల్లుడు గల్లా అశోక్ హీరోగా చేస్తున్న సినిమా పూజా కార్యక్రమాలు జరిగాయి. సితార ఎంటరైన్మెంట్స్ 27వ ప్రాజెక్ట్ గా ఈ సినిమా వస్తుంది. ఈ పూజా కార్యక్రమాలకు సూపర్ స్టార్ మహేష్ సతీమణి నమ్రత ఘట్టమనేని అటెండ్ అయ్యారు.నమ్రత ఫస్ట్ క్లాప్ కొట్టగా పద్మ గల్లా, మంజుల స్వరూప్ చేతుల మీదుగా స్క్రిప్ట్ అందించారు. సినిమా ఘన విజయం సాధించాలని అతిథులు ఆకాంక్షించారు. గల్లా అశోక్ సరసన గౌరీ ప్రియ హీరోయిన్ గా నటిస్తుంది. ఈ సినిమాలో రాహుల్ విజయ్, శివాత్మిక కూడా మరో జంటగా నటిస్తున్నారు.యువ దర్శకుడు ఉద్భవ్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా అమెరికా నేపథ్యంలో సాగుతుందని తెలుస్తుంది. ఈ నెల ఆఖరికి సినిమా రెగ్యులర్ షూట్ కి వెళ్తుంది. సినిమా అంతా ఫుల్ ఎంటర్టైన్మెంట్ తో సాగుతుందని.. దానితో పాటు హృదయాన్ని హత్తుకునే డ్రామా కూడా ఉంటుందని దర్శక నిర్మాతలు చెప్పారు. ఈ సినిమాకు భరధ్వాజ్ ఆర్ కెమెరా మెన్ గా పనిచేస్తున్నారు.సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సం యుక్త బ్యానర్ లో సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని డీటైల్స్ త్వరలో వెల్లడించనున్నారు. సితార బ్యానర్ నుంచి ఇప్పటికే డీజే టిల్లు, మ్యాడ్, టిల్లు స్క్వేర్ సినిమాలు రాగా వాటి తరహాలోనే ఈ సినిమా కూడా వాటి సరసన నిలుస్తుందేమో చూడాలి. ప్రస్తుతం సితార బ్యానర్ నుంచి బాలకృష్ణ బాబీ కాంబో సినిమా సెట్స్ మీద ఉంది. ఈ సినిమా కోసం భారీ బడ్జెట్ కేటాయిస్తున్నట్టు తెలుస్తుంది. ఐతే ఓ పక్క స్టార్స్ తో భారీ సినిమాలు చేస్తూనే మీడియం బడ్జెట్ తో కూడా సినిమాలు చేస్తున్నారు నాగ వంశీ .

## చాన్నాళ్లకు 'రక్త్‌బ్రహ్మాండ్'తో

మా ఇంటి బంగారం'గా ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబవుతోంది అందాల నాయిక సమంత. అనారోగ్య కారణాలతో కొంత కాలంగా సినిమాల నుంచి విరామం తీసుకున్న ఈమె..ఇప్పుడు తన రాబోయే ప్రాజెక్టుల కోసం రంగంలోకి దిగనుంది. ప్రముఖ దర్శకనిర్మాతలు రాజ్ అండ్ డీకే రూపొందిస్తున్న వెబ్‌సిరీస్ 'రక్త్‌బ్రహ్మాండ్'. ది బ్లడీ కింగ్‌డమ్ అనేది ఉపశీర్షిక. రాహి అనిల్ బార్వే దీన్ని తెరకెక్కిస్తున్నారు.ఈ యాక్షన్ ఫాంటసీ సిరీస్‌లో సమంత ప్రధాన పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈమె సిరీస్ చిత్రీకరణను ప్రారంభించినట్లు సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. "ఎప్పటికీ కలలు కనడం ఆపొద్దు. చాలా కాలం తర్వాత మళ్లీ సెట్స్‌పైకి రావడం ఆనందంగా ఉంది" అని వ్యాఖ్యల్ని జోడించింది.వామికా గబ్బి, ఆదిత్య రాయ్ కపూర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మోసం, నమ్మకద్రోహం, ప్రేమ, త్యాగం లాంటి అంశాలతో భారతీయ సినిమా తెరపై ఇప్పటి వరకు రాని సరికొత్త కథాంశంతో దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో ఓటీటీ వేదికగా విడుదల కానుందీ సిరీస్.



## కంగువా రిలీజ్ డేట్ మారింది.. ప్రేక్షకుల ముందుకు ఎప్పుడంటే..



సరికొత్త కథాంశంగా తెరకెక్కిన చిత్రం కంగువ. తమిళ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న ఈ కు దర్శకుడు శివ డైరెక్ట్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని "గ్రీన్ స్టూడియో" నిర్మించింది.ఈ కోసం సూర్య ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు.సరికొత్త కథాంశంగా తెరకెక్కిన చిత్రం కంగువ. తమిళ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న ఈ కు దర్శకుడు శివ డైరెక్ట్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని "గ్రీన్ స్టూడియో" నిర్మించింది. ఈ కోసం సూర్య ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు.సూర్యతో పాటు బాబీ డియోల్, దిశా పటాని, నటరాజన్, యోగి బాబు, సుదీప్ సంజీవ్ నటించారు. అలాగే నటి దిశా పతానీ తమిళంలో తొలిసారి నటిస్తుంది. ఈ షూటింగ్ 2021లో ప్రారంభమైంది. కానీ కరోనా కారణంగా ఆలస్యం అవుతూ వచ్చింది.ప్రస్తుతం ఈ షూటింగ్ పూర్తి చేసుకుని చివరి వర్క్ జరుపుకుంటుంది.అయితే ఈ అక్టోబర్ 10న విడుదల కావాల్సి ఉండగా, రజినీకాంత్ "వెట్టయన్" విడుదల కారణంగా కంగువ విడుదల వాయిదా పడింది.తాజాగా కంగువ నయా రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేసింది. కంగువ చిత్రాన్ని బాలల దినోత్సవం, 2024 "నవంబర్ 14"న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 10 భాషల్లో విడుదల కానుందని తెలుస్తోంది.మ్యూజిక్ కంపోజర్ దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. జూలై 23న సూర్య పుట్టినరోజు సందర్భంగా ఈ టైటిల్ సాంగ్ "ఫైర్ సాంగ్"ని చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సాంగ్ యూట్యూబ్ లో రికార్డ్ క్రియేట్ చేసింది.

## ప్రపంచ క్రికెట్ లో పెను సంచలనం.. ఇకపై కూన అనలేరు

వన్డే ప్రపంచ కప్ లో పాకిస్థాన్ లాంటి మాజీ చాంపియన్ ను ఓడించింది.. టి20 ప్రపంచ కప్ లో సెమీఫైనల్స్ వరకు చేరింది.. వన్డేల్లో మేటి జట్లనూ మట్టికరిపిస్తోంది..టెస్టుల్లో కాస్త నిలకడ తోడైతే ప్రపంచ స్థాయి జట్టుగా హోదా ఇవ్వొచ్చు. ఈ క్రమంలో ఈ చిన్న జట్టు ఓ పెద్ద విజయాన్ని సాధించింది. ఇప్పటివరకు ఒక్క వన్డే కూడా గెలవని ప్రత్యర్థిపై ఏకంగా సిరీస్ ను సాధించింది.దక్షిణాఫ్రికాకు నిద్ర లేని రాత్రులు షార్జా.. ఇప్పుడు క్రికెట్ అభిమానులు అందరూ మర్చిపోయిన పేరు. 30 ఏళ్ల కిందట షార్జాలో క్రికెట్ టోర్నీ అంటే భారత్ లోని అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసేవారు. మరీ ముఖ్యంగా భారత్- పాకిస్థాన్ మధ్యన ఇక్కడ వేసవిలో క్రికెట్ పోటీలు జరిగేవి. నాడు ఐపీఎల్ లేకపోవడంతో షార్జా మ్యాచ్ లు మంచి మజా ఇచ్చేవి. కానీ, ఫిక్సింగ్ భూతంతో షార్జా ప్రతిష్ఠ మసకబారింది. అలాంటి చోట ఇప్పుడు దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ఆడుతోంది




అఫ్ఘానిస్థాన్. స్వదేశంలో మ్యాచ్ లు ఆడే పరిస్థితి లేకపోవడంతో భారత్, షార్జాలను తమ వేదికలుగా చేసుకుంటోంది అఫ్ఘాన్.తొలి వన్డేలోనే చుక్కలు మూడు మ్యాచ్ ల సిరీస్ లో భాగంగా దక్షిణాఫ్రికాతో గత బుధవారం షార్జాలో తొలి వన్డే ఆడిన అఫ్ఘానిస్థాన్ ప్రత్యర్థికి చుక్కలు చూపింది. ప్రపంచ క్రికెట్ లో పెద్ద జట్లలో ఒకటైన సఫారీలను కేవలం 106 పరుగులకే చుట్టేసింది. కేవలం 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఈ టార్గెట్ ను కొట్టేసింది.శుక్రవారం రెండో వన్డేలో మొదట బ్యాటింగ్ కు దిగి ఏకంగా 311 పరుగులు చేసింది. ఆపై దక్షిణాఫ్రికాను 134 పరుగులకే ఆలౌట్ చేసింది. 177 పరుగుల ఆధిక్యంతో గెలుపొంది సిరీస్ ను మరో మ్యాచ్ ఉండగానే కైవసం చేసుకుంది. పరుగులు పరంగా వన్డేల్లో అఫ్ఘానిస్థాన్ కు ఇదే అతిపెద్ద విజయం. అంతేకాదు.. దక్షిణాఫ్రికా వన్డే విజయం, వన్డే సిరీస్ సాధించడం కూడా ఇదే మొదటిసారి. శుక్రవారం మ్యాచ్ లో బర్త్ డే బాయ్ రషీద్ ఖాన్ 19 పరుగులే ఇచ్చి 5 వికెట్లు తీసి అఫ్గాన్ కు మరుపురాని విజయాన్ని అందించాడు.షార్జాలో అఫ్ఘానిస్థాన్ ప్రదర్శన చూసిన వారికి ఇకపై ఆ జట్టును పసికూన అనడానికి సందేహిస్తారేమో..? బ్యాటింగ్ లో, బౌలింగ్ లో ఆ స్థాయిలో అదరగొడుతోంది అఫ్ఘానిస్థాన్. ఆ జట్టుకు చెందిన అజ్మతుల్లా ఒమర్జాయ్ దక్షిణాఫ్రికాపై 50 బంతుల్లోనే 86 పరుగులు బాదేశాడు. జట్టు స్కోరును 300 దాటించాడు. ఇక రషీద్ తో పాటు నంగేలియా కరోటే అనే కొత్త కుర్రాడు 4 వికెట్లు తీశాడు.

## బతికిపోయిన బంగ్లాదేశ్.. అది అడ్డుపడకపోతే మూడో రోజే కథ ముగిసేది!




భారత్-బంగ్లాదేశ్.. రెండూ మిత్రదేశాలు. ఇరు కంట్రీస్ మధ్య మంచి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయి. కానీ క్రికెట్‌లో మాత్రం ఇద్దరి మధ్య శత్రుత్వం ఉంది. టీమిండియా బంగ్లాను అంత సీరియస్‌గా తీసుకోదు.కానీ ఆ జట్టు మాత్రం మనతో మ్యాచ్ అంటే ఓవరాక్షన్ చేస్తుంది. ఒకవేళ గెలిస్తే ఆ టీమ్ ప్లేయర్లు చేసే అతిని తట్టుకోవడం కష్టం. అందుకే ఎప్పుడు బంగ్లా ఎదురుపడినా చిత్తుగా ఓడిస్తుంది మెన్ ఇన్ బ్లూ. ఇప్పుడు కూడా అదే రిపీట్ అవుతోంది. రెండు టెస్టుల సిరీస్ కోసం ఇక్కడికి వచ్చిన షంటో సేన ఇప్పుడు ఓటమి ముంగిట నిలబడింది. పాకిస్థాన్‌ను క్లీన్‌స్వీప్ చేసి భారత్‌ను కూడా ఓడిస్తామంటూ కొన్ని వారాల కింద బిల్డప్ ఇచ్చిన బంగ్లాదేశ్ ఇప్పుడు టీమిండియా ముందు సాగిలపడుతోంది. చెన్నై టెస్ట్‌లో ఆ టీమ్ ఓటమి ఖాయంగా మారింది. అయితే మూడో రోజే బంగ్లా టైగర్స్ కథ ముగియాల్సింది. కానీ అదృష్టం కొద్దీ బతికిపోయింది.బ్యాడ్ లైట్ కారణంగా మూడో రోజు ఆట నిర్దిష్ట సమయం కంటే ముందే ఆగిపోయింది. మబ్బులు కమ్మి కాస్త చీకటి రావడంతో నిర్ణీత ఓవర్ల కంటే ముందే డే-3 గేమ్‌ను నిలిపివేశారు అంపైర్లు.

అప్పటికే బంగ్లాదేశ్ స్కోరు 4 వికెట్ల నష్టానికి 158 పరుగులు. కెప్టెన్ నజ్ముల్ హసన్ షంటో (51 నాటౌట్), ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ (5 నాటౌట్) క్రీజులో ఉన్నారు. మూడు వికెట్లు తీసి జోరు మీదున్నాడు టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్. షాద్మన్ ఇస్లాం (35), మోమినుల్ హక్ (13)తో పాటు సీనియర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీం (13)ను ఔట్ చేశాడు అశ్విన్. పిచ్ స్పిన్‌కు అనుకూలిస్తుండటం, అశ్విన్ జోరు మీదుండటంతో మూడో రోజు బంగ్లా మరో మూడ్నాలుగు వికెట్లు కోల్పోవడం ఖాయంగా కనిపించింది. వాతావరణం అనుకూలించి ఆట మరింత సేపు సాగితే ఆ టీమ్ ఇన్నింగ్స్ ఇంకా డేంజర్‌లో పడేది.వెలుతురు సమస్య రావడంతో బంగ్లాదేశ్ బతికిపోయింది. ఆట మరికొద్ది సేపు జరిగితే ఆ టీమ్ మిడిలార్డర్ బ్యాటర్లంతా పెవిలియన్‌కు చేరేవారు. అదే జరిగితే నాలుగో రోజు కనీసం పోరాడే అవకాశం కూడా దొరికేది కాదు. ఎందుకంటే పిచ్ నుంచి ఇంకా పేసర్లకు మద్దతు దొరుకుతోంది. అదే టైమ్‌లో బాల్ గింగిరాలు తిరుగుతోంది. కాబట్టి అటు పేస్, ఇటు స్పిన్ ధాటికి బంగ్లా లోయరార్డర్ తట్టుకొని నిలబడటం కష్టం. ఆదివారం మార్నింగ్ సెషన్‌లోనే ఆ టీమ్ కథ ముగిసే ఛాన్స్ ఉండేది. కానీ బ్యాడ్ లైట్ వల్ల మూడో రోజు త్వరగా ఆట నిలిచిపోవడంతో షంటో, షకీబ్ బతికిపోయారు. లిటన్ దాస్ నెక్స్ట్ బ్యాటింగ్‌కు వస్తాడు. కాబట్టి నాలుగో రోజు లంచ్ వరకు పోరాడే ఛాన్స్ ఆ టీమ్‌కు దొరికింది. ఎలాగూ ఓడిపోవడం ఖాయం, కానీ బ్యాడ్ లైట్ వల్ల బంగ్లాకు ఫైట్ చేసే అవకాశం దొరికింది. ఆ టీమ్ విజయానికి ఇంకా 357 పరుగుల దూరంలో ఉంది. ఇంకా రెండ్రోజుల ఆట మిగిలి ఉన్నా చేతిలో 6 వికెట్లే ఉన్నాయి. ప్రధాన బ్యాటర్లు ముగ్గురే ఉన్నారు. కాబట్టి బంగ్లా ఓటమి తథ్యం. అయితే టీమిండియా గెలుపును ఆ టీమ్ ఎంత ఆలస్యం చేస్తుందో చూడాలి.

## 1వ టెస్టు బంగ్లాదేశ్‌ను 158/4కి తగ్గించిన భారత్, రవిచంద్రన్ అశ్విన్ ముగ్గురిని ఎంపిక చేశాడు




వెటరన్ ఆఫ్ స్పిన్ ఆల్ రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ మూడు కీలక వికెట్లు పడగొట్టడంతో భారత్ బంగ్లాదేశ్‌ను 37.2 ఓవర్లలో 158/4కి తగ్గించింది, బ్యాడ్ లైట్ కారణంగా ప్రారంభంలోనే, %వీ.ూ%. చిదంబరం స్టేడియంలో శనివారం జరిగిన మొదటి టెస్టులో మూడో రోజు.మరో రెండు రోజుల ఆట మిగిలి ఉన్నందున, మ్యాచ్‌లో స్పష్టంగా డ్రైవర్ సీటులో ఉన్న భారత్ ముందుగా ఆరు వికెట్లు ఎంచుకుందా లేదా ఛేజింగ్‌ను బాగా ప్రారంభించిన బంగ్లాదేశ్, మిగిలిన వాటిని చేయడం ద్వారా అసాధ్యమైనదాన్ని ఆర్కెస్ట్రేట్ చేస్తుందా అనేది ఇప్పుడు వేటాడటం.357 పరుగులు. కెప్టెన్ నజ్మల్ హొస్సేన్ శాంటో 51 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు, షకీబ్ అల్ హసన్ అతనికి ఐదు నాటౌట్‌గా నిలిచాడు.ఓపెనర్లు జకీర్ హసన్ మరియు షాద్మాన్ ఇస్లాం తమ పగలని 56 పరుగుల భాగస్వామ్యాన్ని పునఃప్రారంభించడంతో చివరి సెషన్ ప్రారంభమైంది. జస్ప్రీత్ బుమ్రా జకీర్‌ను డ్రైవ్‌కు వెళ్లేలా ప్రలోభపెట్టడానికి ముందు వీరిద్దరూ తమ ఓపెనింగ్ భాగస్వామ్యానికి కేవలం ఆరు పరుగులను మాత్రమే జోడించగలిగారు మరియు యశస్వి జైస్వాల్ గల్లీ వద్ద అతని ఎడమవైపుకి డైవ్ చేసి అద్భుతమైన క్యాచ్ పట్టారు.అశ్విన్‌ను ఇస్లాం మరియు శాంటో మూడు బౌండరీలు బాదాడు, ఆఫ్ స్పిన్నర్ మిడ్-వికెట్‌లో శుభ్‌మాన్ గిల్‌కి ఫ్లిక్ చేయడానికి ముందు, క్యాచ్‌ను పూర్తి చేయడానికి ముందుకు డైవ్ చేశాడు. షాంటో తన లాఫ్ట్, పుల్ మరియు రివర్స్ స్వీప్‌తో ఆత్మవిశ్వాసాన్ని పెంచుకున్నప్పటికీ, అశ్విన్ బంతిని మోమినుల్ హక్ యొక్క వెలుపలి అంచు నుండి వంకరగా మరియు ఆఫ్-స్టంప్ కొట్టడం ద్వారా స్ట్రైక్ కొనసాగించాడు.శాంటో బౌండరీలు కొట్టడం కొనసాగించాడు మరియు 55 బంతుల్లో అశ్విన్‌ను సిక్స్‌కి స్వీప్ చేయడం ద్వారా అతని యాభైని అందుకున్నాడు. కానీ అవతలి ఎండ్ నుండి, అనుభవజ్ఞుడైన ఆఫ్ స్పిన్నర్ ముష్ఫికర్ రహీమ్‌ను అవుట్ చేసాడు, అతను డ్రైవ్‌ను తగ్గించలేకపోయాడు మరియు కె.ఎల్. మిడ్ ఆన్‌లో రాహుల్ అద్భుతమైన ఫార్వర్డ్ డైవింగ్ క్యాచ్ పట్టాడు.మహ్మద్ సిరాజ్ డ్రింక్స్ తర్వాత బౌలింగ్ అటాక్‌లోకి తిరిగి వచ్చిన కొద్దిసేపటికే, బ్యాడ్ లైట్ కారణంగా ఆటగాళ్ళు బయటికి వెళ్లిపోయారు మరియు చివరికి భారత్ ఆధిపత్యం చెలాయించిన రోజున ఎర్లీ స్టంప్‌లను బలవంతం చేశారు.

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918